# సాక్షి నల్లగొండ

మంగళవారం ၊ 9 ၊ మే ၊ 2023






**భూ సమస్యలకు పరిష్కారం**

భూ సర్వే చేయిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని భూ చట్టాల నిపుణుడు భూమి సునీల్ అభిప్రాయపడ్డారు. - 10లో



**ముగిసిన కల్యాణోత్సవాలు**

మట్టపల్లిలో శ్రీలక్ష్మీనృసింహుడి తిరుకల్యాణోత్సవాలు స్వామివారి శృంగార డోలోత్సవంతో ముగిసాయి. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం 38°/27°

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- జిల్లా జడ్జి నాగరాజు



వీరబాబుకు నియామక పత్రం అందజేస్తున్న జిల్లా జడ్జి నాగరాజు

రామగిరి(నల్లగొండ) : న్యాయశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని జిల్లా జడ్జి నాగరాజు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కోర్టులో జ్యుడిషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన హాజరై మాట్లాడారు. అసోసియేషన్ నూతన భవనాన్ని ప్రారంభించిన అనంతరం నూతన అధ్యక్షుడు మాతంగి వీరబాబుకు జడ్జి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు జడ్జి జయరాజు, రెండవ అదనపు జడ్జి బి.తిరుపతి ఇతర న్యాయమూర్తులు హాజరయ్యారు.

**నూతన కమిటీ..**

జిల్లా అధ్యక్షుడు మాతంగి వీరబాబు, ప్రధాన కార్యదర్శి ఎం.విద్యాసాగర్‌రెడ్డి, కోశాధికారి ఎండీ.లతీఫ్ పాషా, కార్యనిర్వాహణ అధికారి ఎం.వంశీకృష్ణ, ఉపాధ్యక్షులు గిరిధర్, శివకుమార్, సరిత ఎన్నికయ్యారు.

### శాంతిభద్రతల సమస్యగా మారొద్దు

- ఎస్పీ అపూర్వరావు



గ్రీవెన్స్ డేలో బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : భూ వివాదాలు శాంతి భద్రతల సమస్యగా మారొద్దని ఎస్పీ అపూర్వరావు పేర్కొన్నారు. సోమవారం పోలీస్ గ్రీవెన్స్ డే సందర్భంగా బాధితుల నుంచి ఆమె ఫిర్యాదులు తీసుకుని మాట్లాడారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసి మోసం చేసే వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సమగ్రంగా విచారించి న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

### 639 అడుగులకు మూసీ నీటిమట్టం



కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

కేతేపల్లి : జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం 639 అడుగులకు చేరుకుంది. ప్రభావంతో మూసీ పరివాహక ప్రాంతంలో 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు మూసీలోకి ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. సోమవారం ఎగువ నుంచి మూసీకి 1,310 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మూసీ పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 639 అడుగులకు (2.90 టీఎంసీలు) చేరుకుందని అధికారులు పేర్కున్నారు. మరో ఆరు అడుగుల నీరు చేరితే నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకుంటుందని తెలిపారు.

### డిగ్రీ కాలేజీలకు వేసవి సెలవులు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీలకు వేసవి సెలవులు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ గవర్నమెంట్ కాలేజీ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంజీయూ రిజిస్ట్రార్ కృష్ణారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గతేడాది కూడా సెలవులు ఇవ్వలేదని ఈ ఏడాదైనా ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అసోసియేషన్ నాయకులు మునీర్, రామరాజు, సుదర్శన్‌రెడ్డి, శివవాణి, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏడాదిలోనే ఇద్దరు బలి



కాల్పులు జరిపింది ఈ షాపింగ్ మాల్‌లోనే..

**అమెరికాలో కాల్పుల ఘటనలతో కలవరం**

- 2022 జూన్‌లో నల్లజాతీయుడి కాల్పుల్లో నల్లగొండకు చెందిన సాయిచరణ్ మృతి
- టెక్సాస్‌లో శనివారం జరిగిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన నేరేడుచర్ల వాసి ఐశ్వర్య

నల్లగొండ క్రైం : అమెరికాలో తరచుగా జరుగుతున్న కాల్పుల్లో మన జిల్లాకు చెందిన వారు మృతిచెందుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దుండగుల కాల్పుల్లో యేడాది వ్యవధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు బలయ్యారు. నల్లగొండ పట్టణానికి చెందిన నక్క సాయిచరణ్ గత సంవత్సరం జూన్ 22న అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం బాల్టిమోర్ సిటీలో నల్లజాతీయుడు జరిపిన కాల్పుల్లో మృతిచెందాడు. సాయిచరణ్ తన స్నేహితుడిని ఎయిర్‌పోర్టులో దింపి వస్తుండగా సాయిచరణ్ కారుపై నల్లజాతీయుడు కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన సాయిచరణ్‌ను అక్కడి పోలీసులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగానే మృతిచెందాడు. శనివారం టెక్సాస్ రాష్ట్రం అలెన్ పట్టణంలోని షాపింగ్‌మాల్‌లో దుండగుడు జరిపిన కాల్పుల్లో సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన ఐశ్వర్య మృతిచెందింది. షాపింగ్‌మాల్‌లో ప్రజలపై విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 8 మంది మృతిచెందగా.. వారిలో ఐశ్వర్య కూడా ఉంది. టెక్సాస్‌లోని పర్ఫెక్ట్ జనరల్ కాంట్రాక్ట్ కంపెనీలో ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేస్తున్న ఐశ్వర్య షాపింగ్‌కు వెళ్లి బయటకు వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి కాల్పులు జరిపాడు.



నేరేడుచర్లలో ఐశ్వర్య తాత రామనర్సింహారెడ్డిని పరామర్శిస్తున్న స్థానికులు



ఐశ్వర్య (ఫైల్)

**ఎన్నో ఆశలతో అగ్రరాజ్యానికి..**

ఉద్యోగం, ఉన్నత చదువుల కోసం చాలా మంది అమెరికాకు వెళ్తున్నారు. అమెరికాకు వెళ్తే పిల్లల భవిష్యత్ ఎంతో బాగుంటుందని తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి వేల సంఖ్యలో విద్యార్థులు అగ్రరాజ్యంలో ఉన్నారు. బంగారు భవిష్యత్ కోసం పిల్లలను అమెరికాకు పంపుతున్నప్పటికీ ఆ దేశంలో తరచుగా జరుగుతున్న కాల్పుల సంఘటనలు ఆందోళనకలిగిస్తున్నాయి.

**భారతీయులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలి**

నేరేడుచర్ల: అమెరికాలో భారతీయులపై దుండగులు దాడులు చేయడం, కాల్పులు జరిపి హత్యచేయడం వంటి ఘటనలు జరగకుండా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నల్లగొండ ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఫోన్‌లో విలేకరులతో మాట్లాడారు. అమెరికాలోని టెక్సాస్‌లో జరిగిన కాల్పుల్లో నేరేడుచర్లకు చెందిన తాటికొండ ఐశ్వర్య మృతిచెందడం బాధాకరం అని అన్నారు. ఐశ్వర్య కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఐశ్వర్య మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవచూపాలన్నారు.

## లారీల కొరత.. మిల్లర్ల కొర్రీలు

- ధాన్యం అమ్ముకునేందుకు అన్నదాతకు అవస్థలు
- సకాలంలో రాని లారీలు.. వెళ్లినా వెంటనే దింపుకోని మిల్లర్లు
- హాలియా ప్రాంతంలో ధాన్యం తరలించే లారీలకు వేలం
- బస్తాకు రూ.2 ఇస్తామంటూ లారీల డ్రైవర్లతో బడా రైతుల బేరాలు
- చిన్న రైతుల ధాన్యాన్ని తీసుకెళ్లని లారీలు
- కాంటాలు అయినా కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఓవైపు లారీల కొరత.. మరోవైపు మిల్లర్ల కొర్రీలతో ధాన్యం అమ్ముకునేందుకు రైతులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. కల్లాలకు ధాన్యం తెచ్చి నెల రోజులు గడిచినా తూకం వేయకపోవడం, ఏదో విదంగా తూకం వేసినా వెంటనే లారీలు రాకపోవడంతో కల్లాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. తూకం వేశాక రెండు మూడు రోజులు ఎగుమతి కాకపోవడంతో అకాల వర్షాలతో ధాన్యం బస్తాలు తడిచిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరోవైపు లారీల్లో ఎగుమతి చేసిన ధాన్యాన్ని మిల్లుల్లోనూ వెంటనే దిగుమతి చేసుకోకుండా కొర్రీలు పెడుతుండడంతో ఆవేదన చెందుతున్నారు. ఈ యాసంగిలో రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేసిన జిల్లాగా నల్లగొండ ముందున్నప్పటికీ లారీల యజమానులు, మిల్లర్ల కొర్రీలతో రైతులకు ఇబ్బందులు కూడా అదే తరహాలోనే ఎదురవుతున్నాయి.

**లారీలను ఏర్పాటు చేయడంలో విఫలం..**

ఈ సీజన్‌లో జిల్లాలో ధాన్యం దిగుబడి అధికంగా వచ్చింది. అయితే దానికి అనుగుణంగా లారీలు ఏర్పాటు చేయడంలో కాంట్రాక్టర్లు విఫలమయ్యారు. నల్లగొండ నియోజకవర్గ పరిధిలో ఎక్కడ చూసినా లారీల కొరతే. ఒక్కో మండలంలో 30 లారీల వరకు ప్రతిరోజు రావాల్సి ఉన్నా పది కూడా రావడంలేదు. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళనకు దిగుతుండటంతో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ప్రతిరోజు కొనుగోలు కేంద్రాలకు వెళ్లి ధాన్యం తరలింపు వేగవంతం చేయించాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రంలో కాంటా వేసినా ధాన్యం మిల్లులో దింపుకునే వరకు బాధ్యత రైతుదే కావడంతో రైతులు సైతం ఇబ్బందులు పడక తప్పడం లేదు.



తిప్పర్తిలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

**తరలింపు ప్రక్రియ ఆలస్యం..**

ధాన్యం దిగుమతి చేసుకోవడంలో మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. కల్లాల్లో ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే లారీలు రాకపోవడం వల్ల మిల్లులకు ధాన్యం తరలింపు ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఇదిలా ఉంటే మిల్లర్లు కూడా ధాన్యంలో రంగు మారిందనో, తాలు ఉందనో, వడ్లు తడిసాయనో ఏదో ఒక కొర్రీ పెడుతూ ధాన్యం దిగుమతి చేసుకోవడం లేదు. దీంతో రెండు మూడు రోజులపాటు లారీలు మిల్లుల వద్దే ఉండాల్సి వస్తోంది. దానివల్ల ధాన్యం ఎగుమతిలో జాప్యం అవుతోంది. అధికారులు ఒక ప్రాంతానికి వెళ్లి మిల్లుల్లో తనిఖీలు చేస్తూ అన్‌లోడింగ్ చేయిస్తుంటే మరో ప్రాంతంలో మిల్లర్లు కొర్రీలు పెడుతూ జాప్యం చేస్తున్నారు. తడిసిన ధాన్యం అయినా కొనుగోలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేసినా మిల్లర్లు మాత్రం ఆ ధాన్యాన్ని దింపుకోవడంలో కిరికిరి పెడుతున్నారు. దీంతో కల్లాల నుంచి వెళ్లిన లారీలు రెండు రోజుల వరకు రాకపోవడం, కాంట్రాక్టర్లు నిబంధనల మేరకు లారీలను అందుబాటులో ఉంచలేకపోవడంతో రైతులు నానా తంటాలు పడాల్సి వస్తోంది.

**రూ. 2 ఇస్తేనే లారీలు..**

ధాన్యం అమ్ముకోవడం ఒక సమస్య అయితే అమ్మిన ధాన్యాన్ని మిల్లుకు తరలించడం రైతులకు మరో తలనొప్పిగా మారింది. జిల్లాలో అనేక చోట్ల కాంట్రాక్టర్ ఇచ్చే డబ్బులు ధాన్యం రవాణాకు సరిపోవడం లేదంటూ లారీ యజమానులకు బస్తాకు రూ.2 చొప్పున ఎక్కువగా ఇస్తేనే రవాణా చేస్తామని మొండికేస్తున్నారు. హాలియా ప్రాంతంలోని కొన్ని కొనుగోలు కేంద్రాల్లో బడా రైతులు అందుకు అంగీకరించడమే కాకుండా.. ముందుగా తమ ధాన్యం బస్తాలను తీసుకెళ్లేందుకు బస్తాకు ఇంత ఇస్తామంటూ లారీలకు వేలం వేస్తున్నారు. దీంతో డబ్బులు ఇవ్వని చిన్న రైతుల ధాన్యం కల్లాల్లోనే మగ్గాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో అకాల వర్షాలు పడుతుండటంతో తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిసిపోయి అమ్ముకునేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తుంది.

**కొనుగోళ్లు వేగవంతం చేయాలి : కలెక్టర్**

రామగిరి(నల్లగొండ) : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం తిప్పర్తి మార్కెట్ యార్డులోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సెంటర్ నిర్వాహకులు, లారీ కాంట్రాక్టర్, మిల్లర్లతో దాదాపు రెండు గంటల పాటు మాట్లాడారు. ధాన్యం రాశులు అధికంగా ఉన్నాయని లారీలు ఎక్కువగా పంపాలని లారీ కాంట్రాక్టర్లను ఆదేశించారు. ధాన్యం దిగుమతి ఆలస్యం కాకుండా చూడాలని మిల్లర్లకు చెప్పారు. ధాన్యం అధికంగా ఉన్నందున హమాలీలను పెంచాలని కాంటాలను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంటన డీఆర్‌డీఓ కాళిందిని, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, ఆర్‌టీఓ సుదర్శన్‌రెడ్డి, డీఎం నాగేశ్వరావు, తహసీల్దార్ కృష్ణయ్య, పీఏసీఎస్ చైర్మన్ పాశం సంపత్ రెడ్డి, ఏఓ సన్నీరాజ్ తదితరులు ఉన్నారు.

**లారీలు రావడంలేదు**



25 రోజుల కిందట అంతయ్యగూడెం ఐకేపీ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చా. రెండు రోజుల కిందట ధాన్యం కాంటా వేశారు. 800 బస్తాలు ఉన్నాయి. లారీలు రాకపోవడం వల్ల ధాన్యం మిల్లుకు పోలేదు. దీంతో కల్లాల వద్దే పడిగాపులు గాస్తున్నాం.

– కన్నెబోయిన శంకర్, గొల్లగూడెం

**డబ్బులు ఇవ్వందే లారీలు రావడం లేదు**



ధాన్యం కాంటాలు వేసిన తరువాత లారీలను డబ్బులు ఇచ్చి తెచ్చుకోవాల్సి వస్తోంది. లేకపోతే బస్తాలు లారీలకు ఎత్తడం లేదు. మిల్లుల్లో తాలు పేరిట కోతలు పెట్టడంతో రెండు విధాలుగా ఇబ్బందులు తప్పడం లేదు.

– తొడబోయిన చంద్రశేఖర్, పెద్దదేవులపల్లి

## ఇంకెన్నాళ్లీ పడిగాపులు..



పెద్దవూరలో తడిసిన ధాన్యాన్ని రోడ్డుపై పోసి రాస్తారోకో చేస్తున్న రైతులు

- పెద్దవూర వద్ద రైతుల రాస్తారోకో
- వర్షంతో ధాన్యం తడిసిపోయిందని ఆవేదన

పెద్దవూర : కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి కాంటాల కోసం ఎన్నాళ్లు పడిగాపులు కాయాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని పెద్దవూరలోని విశ్వనాథ్ స్పిన్నింగ్ మిల్లు సమీపంలో కోదాడ – జడ్చర్ల రహదారిపై పోసి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మ్యాచర్ వచ్చి పదిహేను రోజులు దాటినా ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సంతో చెట్లు కూలిపోయి ధాన్యం రాశులపై పడ్డాయని, పట్టాలు కొట్టుకుపోయి.. ధాన్యం తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటివద్ద రోజు పనులు వదులుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నామని, రాత్రిళ్లు నిద్ర కూడా పట్టడం లేదన్నారు. రైతుల రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎస్ఐ పచ్చిపాల పరమేష్ సంఘటన స్థలానికి వచ్చి రైతులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో రైతులు వజ్జ సత్తిరెడ్డి, పుట్ట సత్తయ్య, ఏరుకొండ సాయిలు, ఆంజనేయులు, మంచికంటి వెంకటేశ్వర్‌రెడ్డి, ఇంద్రకంటి సైదులుగౌడ్, హరీష్‌రెడ్డి, మర్రి సాయి, ఆవుదొడ్డి వెంకన్న, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

**రాశుల చుట్టూ వర్షపు నీరు**

పెద్దఅడిశర్లపల్లి : మండంలో సోమవారం కురిసిన అకాల వర్షంతో అజ్మాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. కేంద్రంలోని రాశుల కింద నీరు నిలిచింది. రాశుల నుంచి నీటిని తీసేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు.



ఘనపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో రాశుల మధ్య వర్షపు నీరు

## శివాలయంలో విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం విశేష పూజలు కొనసాగాయి. శ్రీస్వామి వారికి నిత్య పూజలు జరిపించి, మండపంలో నిత్య రుద్ర హవనం జరిపించారు. మహాశివుడికి అభిషేక, అర్చనలు చేశారు. శివ గర్భాలయం, ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు చేసి, హారతినిచ్చారు. కాగా.. యాదాద్రీశుడికి ఉదయం నుంచి రాత్రి వరకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. సుప్రభాతం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలు చేపట్టారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

## క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నల్లగొండ టూటౌన్ : ఈనెల 15 నుంచి నిర్వహించనున్న చీఫ్ మినిస్టర్స్ కప్–2023 క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పోటీల నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయి, 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయి, 28 నుంచి 31 వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉంటాయని తెలిపారు. మండల స్థాయి, జిల్లా స్థాయి కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. మండల స్థాయిలో ఖోఖో, అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్ వంటి 11 క్రీడా పోటీలు ఉంటాయని తెలిపారు. 15 నుంచి 36లోపు ఏళ్ల లోపు వారిని మాత్రమే గుర్తించాలని, నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. క్రీడలు నిర్వహించే ప్రాంతాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం కోటేశ్వర్‌రావు, డీపీఆర్వో శ్రీనివాస్, గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ధాన్యానికి మద్దతు ధర

కేతేపల్లి : ప్రభుత్వం నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చి రైతులు మద్దతు ధర పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి, కేతేపల్లి మండల ప్రత్యేక అధికారి వై.సుచరిత సూచించారు. కేతేపల్లి మండలంలోని ఇనుపాముల, కొర్లపహాడ్, చీకటిగూడెం, కొప్పోలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆమె సోమవారం సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కాంటాలు వేసిన బస్తాలను తరలించేందుకు లారీల సమస్య ఉంటే.. ట్రాక్టర్ల ద్వారానైనా మిల్లులకు తరలించాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఏఓ బి.పురుషోత్తం తదితరులు ఉన్నారు.



ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఏఓ

## నిమ్మకు నీరసం!



నకిరేకల్ మార్కెట్‌లో నిమ్మ కాయల బస్తాలు



నిమ్మకాయలు గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

- తగ్గుముఖం పడుతున్న నిమ్మకాయ ధరలు
- వేసవిలోనూ వర్షాల వల్ల తగ్గిన డిమాండ్
- నకిరేకల్ మార్కెట్‌లో ప్రస్తుతం బస్తా ధర రూ.450 లోపే..

నకిరేకల్ : నిమ్మ ధర నీరసించింది. వచ్చే నెల మృగశిర కార్తి లోపు నిమ్మ సీజన్ ముగుస్తుంది. రైతుల ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తున్నా.. ధర మాత్రం అంతగా రావడం లేదు. దీంతో నిమ్మ రైతులు నిరాశలో ఉన్నారు. ప్రతి ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మార్కెట్‌లో బస్తా నిమ్మ ధర రూ.1100 నుంచి రూ.1400 వరకు పలికేది. కానీ ప్రస్తుతం రూ.400 నుంచి రూ.450 వరకు మాత్రమే పలుకుతోంది. పట్టణాల్లో చిల్లర మార్కెట్‌లో మాత్రం రూ.10కి మూడు కాయలు చొప్పున అమ్మకాలు సాగుతున్నాయి. మార్కెట్‌లో సరైన ధర రాక నిమ్మ రైతులు దిగాలు చెందుతున్నారు.

**రోజూ 4 వేల బస్తాలు రాక..**

తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక నిమ్మ మార్కెట్ నకిరేకల్‌లో ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 30వేల ఎకారాల్లో నిమ్మ తోటలు సాగువుతున్నాయి. ఈ మార్కెట్‌లో రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిమ్మ వ్యాపారం సాగుతుంది. ఇక్కడి మార్కెట్‌కు రోజూ 3 వేల నుంచి 4వేల వరకు నిమ్మ బస్తాలు వస్తున్నాయి. ఇక్కడ నుంచి డీసీఎంలలో హైదరాబాద్‌కు తరలించి.. అక్కడ నుంచి ఢిల్లీ మార్కెట్‌కు ఎగుమతి అవుతాయి.

**మార్కెట్‌కు.. కాయలు, పిందెలు**

ప్రస్తుతం వేసవి సీజన్‌లో కూడా వర్షాలు కురుస్తుండడం, దేశ రాజధాని ఢిల్లీలో కూడా నిమ్మకు డిమాండ్ లేకపోవడంతో ధరలు భారీగా పడిపోతున్నాయని మార్కెటింగ్ అధికారులు అంటున్నారు. ఇప్పుడు వర్షాలకు తోడు గాలి దుమారాలు రావడంతో రైతులు తమ తోటల్లో చెట్టుపై కాయలు పండు దశకు రాకముందే పిందెలను తెంపుకుని రావడంతో నాణ్యత ఉండడం లేదు. నిమ్మ కాయలు పండు దశ వస్తేనే మంచి ధర వస్తుందని.. పిందెలు, కాయలు మార్కెట్‌కు రావడంతో మంచి రేటు దక్కడం లేదని అధికారులు చెబుతున్నారు. ఏదేమైనా నిమ్మకు ఒక నిలకడ ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

**నిలకడ ధర నిర్ణయించాలి**



నేను మూడు ఎకరాల్లో నిమ్మ సాగు చేశాను. 250 చెట్లు ఉన్నాయి. నకిరేకల్ నిమ్మ మార్కెట్‌కు 12 బస్తాల నిమ్మకాయలు తీసుకొచ్చాను. ఒక్కో బస్తాకు రూ.450 చొప్పున ధర వచ్చింది. గతేడాది ఏప్రిల్‌లో బస్తా ధర రూ.1200 వరకు వచ్చింది. నిమ్మ దీర్ఘకాలిక పంట అయినందున ప్రభుత్వం బస్తాకు ఒక నిలడక ధరను నిర్ణయించి కొనుగోలు చేయాలి.

– యానాల శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మ రైతు, నకిరేకల్

**ఢిల్లీలోనే డిమాండ్ లేదు**



వర్షాల కారణంగా నిమ్మ ధరలు కొంతమేర తగ్గాయి. నకిరేకల్ నిమ్మ మార్కెట్ నుంచి నేరుగా ఢిల్లీ మార్కెట్‌కు వెళ్తాయి. వర్షాల ప్రభావంతో ఢిల్లీలో కూడా నిమ్మకు డిమాండ్ లేక ఎగుమతి కావడం లేదు. ప్రస్తుతం నకిరేకల్ మార్కెట్‌లో పిందె సైజు కాయలకు బస్తాకు రూ.400 నుంచి 600 వస్తోంది. మంచి సైజు గల పండ్లకు బస్తాకు రూ.900 నుంచి 1200 వరకు పలుకుతోంది.

– శ్రీనాథరాజు, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి, నకిరేకల్ వ్యవసాయ మార్కెట్

## క్లుప్తంగా

### అప్పుల బాధ తాళలేక..

● మాదాపూర్ దుర్గం చెరువులో దూకి 'పేట' వాసి ఆత్మహత్య

సూర్యాపేట క్రైం, మాదాపూర్ : అప్పుల బాధ తాళలేక సూర్యాపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని జేజేనగర్‌కు చెందిన లెంకల వెంకటనర్సింహారెడ్డి(31) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈయన ఏడాది క్రితం హైదరాబాద్‌కు చెందిన ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకుని అంబర్‌పేటలో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో అధికంగా అప్పులు చేయడం, వాటిని తిరిగి చెల్లించే స్థోమత లేకపోవడంతో పాటు కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఈ నెల 6న అదృశ్యమైనట్లు... అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. సోమవారం సాయంత్రం లభ్యమైన అతడి మృతదేహానికి అక్కడి పోలీసులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాత్రి నరసింహారెడ్డి మృతదేహానికి సూర్యాపేట పట్టణంలో అంత్యక్రియలు ముగిశాయి.

### గోపాలపురంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

హుజూర్‌నగర్‌రూరల్ : ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన నిడిగొండ సురేష్(30) కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.పరిస్థితి విషమంగా ఉండటంతో సూర్యాపేట ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు.



# పెద్దవూరలో ఈదురుగాలుల బీభత్సం

● లేచిపోయిన ఇళ్ల పైకప్పులు, విరిగిన చెట్లు
● నేలవాలిన వరిచేలు.. వర్షానికి తడిసిన ధాన్యం


సంగారంలో గాలివానకు లేచిపోయి దూరంగా రోడ్డుపై పడిన రేకులు


పెద్దవూరలో కూలిపోయిన బత్తాయి చెట్లు


పెద్దవూరలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

పెద్దవూర: పెద్దవూర మండలంలో సోమవారం సాయంత్రం గాలి, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మండలంలోని పోలేపల్లి, సంగారం, పిన్నవూర గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డు, విశ్వనాథ్ స్పిన్నింగ్ మిల్లు పరిసరాలను అతలాకుతలం చేశాయి. పోలేపల్లి గ్రామ పరిధిలో వడగండ్ల వాన కురవడంతో వరిపంట నేలవాలింది. వడ్లు మొత్తం రాలిపోయి నేలపాలయ్యాయి. మండలంలోని సంగారం గ్రామానికి చెందిన చిట్టిమళ్ల లక్ష్మయ్య ఇంటి పైకప్పు రేగులు లేచిపోయి మూడు వందల మీటర్ల దూరంలో రోడ్డుపై పడ్డాయి. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఇంట్లో, రోడ్డుపై గాని ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉన్న సామగ్రి తడిసి ముద్దయ్యింది. ఎలాక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. విశ్వనాథ్ స్పిన్నింగ్ మిల్లు సమీపంలో రైతులు పోసుకున్న వరి ధాన్యం తడిసిపోయింది. చెట్లు విరిగిపోయి ధాన్యం రాశులపై పడ్డాయి. ధాన్యం రాశులపై వేసిన పట్టాలు సైతం గాలికి కొట్టుకుపోయాయి. మండల కేంద్రానికి చెందిన నడ్డి శ్రీనివాస్, నడ్డి ఆంజనేయులు, తేరా చిన్నపురెడ్డి తోటల్లోని బత్తాయి చెట్లు విరిగిపోయాయి. తేరా చిన్నపురెడ్డి బత్తాయి తోట చుట్టూ ఉన్న శ్రీగంధం, ఎర్ర చందనం చెట్లు ఇరవైకిపైగా కూలిపోయాయి. జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై చెట్లు విరిగి పడటంతో ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తన సిబ్బందితో వచ్చి తొలగించారు. విశ్వనాథ్ స్పిన్నింగ్ మిల్లు ఎదురుగా రోడ్డు పక్కన ఏర్పాటు చేసుకున్న డబ్బా కొట్టుపై చెట్టు విరిగిపడటంతో అది ధ్వంసమైంది. ఆ సమయంలో డబ్బా వద్ద ఉన్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి.


సంగారంలో రేకులు లేచిపోయి ఖాళీ గోడలు కనిపిస్తున్న లక్ష్మయ్య ఇల్లు


పెద్దవూరలో డబ్బా దుకాణంపై కూలిన చెట్టు


రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును స్థానికులతో కలిసి తొలగిస్తున్న ఎస్‌ఐ పరమేష్

# రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన తిప్పర్తి మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం హర్దోయి జిల్లాకు చెందిన జితేందర్ కుమార్ (20) జిల్లా కేంద్రంలో ఐస్‌క్రీమ్ కంపెనీలో పని చేస్తున్నాడు. నల్లగొండ చుట్టూ పక్కల గ్రామాల్లో ఐస్‌క్రీమ్ విక్రయిస్తుంటాడు. సోమవారం టీవీఎస్ వాహనంపై ఐస్ క్రీమ్ డబ్బాతో తిప్పర్తి మండలం రాయినిగూడెం వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జితేందర్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి సోదరుడు రామ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ ఎస్.రామ్మూర్తి తెలిపారు.

# గీత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి


కార్మికులతో గీత కార్మిక సంఘం నాయకులు

మునగాల: గీతకార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మండల కేంద్రంలో గుర్తింపు కార్డుల కోసం నిర్వహించిన టెస్టులో ఆయన పాల్గొని మాట్లాడారు. గుర్తింపు కార్డు ద్వారానే గీత కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. 50సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికుడికి వృద్ధాప్య పింఛన్ వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది ఎండి.సలీమ్,నాగరాజు, సంఘం నాయకులు మామిడి శ్రీనివాస్ గౌడ్, కాసాని వీరస్వామి,పెద్ద గౌడ్ నారగాని వెంకన్నగౌడ్, రాంబాబు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కొండ రామానుజం గౌడ్, మామిడి గుర్నాథం గౌడ్, బత్తిని రామకృష్ణ, నారగాని రాంబాబు, మండవ శేషు, నారగాని గోపి, మండవ రాంబాబు, మామిడి చెర్రిగౌడ్, వెంకన్న గౌడ్, బత్తిని సూరి గౌడ్ , శివ సాయి గౌడ్, జనార్దన్, పలువురు కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు.

# క్రీడాపోటీలకు ఏర్పాట్లు చేయాలి

సాక్షి,యాదాద్రి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సీఎం కప్ – 2023 క్రీడాపోటీలకు మండల, జిల్లా స్థాయిలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా పమేలా సత్పతి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం కప్ క్రీడాపోటీలకు ప్రతి గ్రామం నుంచి 15 నుంచి 36 సంవత్సరాల వయసు గల యువతీ, యువకులు పాల్గొనేలా చూడాలన్నారు. మండల స్థాయిలో పోటీలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు ఉంటాయన్నారు. మండల కమిటీ వారు తెలంగాణ క్రీడా ప్రాంగణంలో కానీ, హై స్కూల్స్‌లో కానీ, గురుకుల పాఠశాలల్లో కానీ ఈ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా స్థాయిలో 22 నుంచి 24వ తేదీ వరకు భువనగిరిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్(బాలుర)లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో (11) విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి, అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ ఉన్నారు.

**విద్యాశాఖకు టెక్నికల్ సపోర్ట్ చేసేందుకు..**

నారాయణమ్మ టెక్నికల్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీవిద్య, వారి సంస్థల అధికారులతో సోమవారం కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖకు టెక్నికల్ సపోర్ట్ చేసేందుకు వారితో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియట్ శాఖ అధికారులను కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారిణి రమణి, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్‌రెడ్డి, అందాలు పాల్గొన్నారు.

# వేసవిలో వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గుర్రంపోడు : వేసవిలో అకాల వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఉమ్మడి జిల్లాలోని ఆయా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోయిన ఘటనలు అనేక ఉన్నాయి. వేసవిలో వచ్చే పకృతి వైపరీత్యాలతో పంటల కోత, నూర్పిడులపై తీవ్ర ప్రభావం చూపడం నేడు రైతులకు ఆందోళన కల్గిస్తోంది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని గుర్రంపోడు మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి సూచిస్తున్నారు.

**రైతులకు ఏఓ సూచనలు**

❖ కొనుగోలు కేంద్రాల్లో వరద నీరు రాకుండా ఎత్తుగా ఉండే ప్రదేశంలో ధాన్యం కుప్పలు పోసుకోవాలి.
❖ టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచుకుని సాయంత్రానికి మబ్బులను గమనించుకుంటూ కుప్పలు కప్పివేయాలి.
❖ వర్షం కురియగానే వీలైనంత త్వరగా ఉద్యాన, కూరగాయల పంటల్లో నీరు నిల్వలేకుండా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.
❖ గాలులతో కూడిన వర్షానికి వేళ్లతో సహా ఒరిగిన బత్తాయి, నిమ్మ, మామిడి చెట్లను లేపి కర్రలతో నిలబెట్టి మట్టిని ఎగదోసి ఊతమివ్వాలి.
❖ అకాల వర్షాలకు కూరగాయల పంటల్లో చీడపీడలు ఉధృతమయ్యే అవకాశం ఉన్నందున వాటి నివారణ చర్యలు చేపట్టాలి.
❖ ఉద్యానవన తోటల్లో విరిగిన కొమ్మలను కత్తిరించి పైభాగాన బోర్డోపేస్టు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ పూతగా పూయాలి.
❖ టమాట తోటలో కూడా పొటాషియం నైట్రేట్ 1శాతం ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి. కూరగాయల్లో బూజు లేద బాక్టీరియా తెగులు గమనించినట్లయితే కాపర్ సంబంధిత మందులు పిచికారీ చేసుకోవాలి.
❖ వడగండ్లు పడే సమయంలో పశువులను కరెంటు స్తంభాలకు కట్టి వేయకూడదు. వాటిని ట్రాక్టర్, ఇతర లోహసంబంధిత పనిముట్లకు దూరంగా ఉంచాలి.
❖ చెట్లు లేదా ఎత్తైన ప్రదేశాల్లో పిడుగుల పడే అవకాశం ఎక్కువగా ఉంటున్నందున ఆ సమయంలో పొరపాటున కూడ చెట్ల కింద ఉండరాదు.


ఈదురు గాలులకు పడిపోయిన నిమ్మచెట్టుకు నలువైపులా కర్రలతో ఊతం

పాడి పంట

❖ వేర్లను తెగుళ్ల నుంచి కాపాడటానికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి నేలలో పోయాలి.
❖ పుచ్చ పంట పాక్షికంగ దెబ్బతిన్నట్లయితే పండు ఈగ నివారణకు హెక్టారుకు 10 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి.

# అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతా

● భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి


సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: అభివృద్ధిలో భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీని అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ఆరవ వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా వార్డులోని ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధుల్లో అవసరమైన చోట సీసీ రోడ్లు, అండర్ డ్రెయినేజీ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం టూరిజం కేంద్రం నుంచి రేవనపల్లి వరకు జరుగుతున్న బీటీ రోడ్డు పనులు పరిశీలించారు. మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కట్ట మైసమ్మ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు కర్నాటి రవీందర్, గుండు మధు, సామల మల్లారెడ్డి, దేవరాయ కుమార్, పబ్లిక్‌హెల్త్ ఈఈ సత్యనారాయణ, డీఈ మనోహర, ఏఈ శ్రీరాములు తదితరులున్నారు.

## ఉద్యోగాల కల్పనలో మోదీ ప్రభుత్వం విఫలం

భూదాన్‌పోచంపల్లి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ఆరోపించారు. ఆదివారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని పెద్దరావుపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఐ బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్విస్‌బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు ఇస్తామని ప్రజలకు ఇచ్చిన హామీని ప్రధాని మోదీ విస్మరించారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి గోడ్ల నాగభూషణం, గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి పబ్బు యాదయ్య, నాయకులు బీమగాని నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ అనుసంధానం 94 శాతం పూర్తి


మాట్లాడుతున్న యాదాద్రి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి,యాదాద్రి: జిల్లాలో ఓటర్ కార్డుకి ఆధార్ అనుసంధానం 94 శాతం పూర్తయిందని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తయిన వారు ఓటరు కార్డులో మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఈవీఎంలను మొదటి దశ తనిఖీ చేస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులకు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని కోరారు. ఎపిక్ కార్డు వచ్చిన వారికి స్పీడ్ పోస్ట్ ద్వారా పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారులు భూపాల్‌రెడ్డి, రాజకీయ పార్టీ ప్రతినిధులు బట్టు రామచంద్రయ్య, ఏశాల అశోక్, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, రామరావు, సురేష్‌బాబు ఉన్నారు.

## ● మొలకెత్తిన ఆరుగాల కష్టం

అర్వపల్లి: వడగళ్ల, అకాల వర్షాలకు చేతికొచ్చిన వరి పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. వరికోసి ధాన్యం తెచ్చి హైవే రోడ్లపై రైతులు రాశులు పోసి ఉంచగా ఎక్కడికక్కడ మొలకెత్తుతున్నాయి. జాజిరెడ్డిగూడెం మండలంలోని 365, 365బీ హైవేలపై సీతారాంపురం, బొల్లంపల్లి, తిమ్మాపురం, అడివెంల, వేల్పుచర్ల తదితర ప్రాంతాల్లో హైవేలపై రాశులు పోసిన ధాన్యం సగం వరకు మొలకలెత్తింది. ఆ ధాన్యాన్ని రైతులు హైవే రోడ్లపై ఆరబోసుకుంటున్నారు. ఈసారి మొలకెత్తిపాడైన ధాన్యం తప్ప తమకు గింజ ధాన్యం మిగలలేదని, పైసా చేతికందలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మొలకలు వచ్చిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు



# ముగిసిన చిత్రలేఖనం శిక్షణ శిబిరం

● సాక్షి మీడియా గ్రూప్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహణ
● శిక్షణ పొందిన 65మంది విద్యార్థులకు చివరి రోజు పోటీలు
● ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతి


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భువనగిరి : సాక్షి మీడియా గ్రూప్, రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విజ్ఞాన్ ఐఐటీ క్యాంపస్‌లో విద్యార్థులకు నిర్వహిస్తున్న చిత్రలేఖనంపై వేసవి ఉచిత శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. నాలుగు రోజుల పాటు సాగిన ఈ శిబిరంలో 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు జూనియర్ విభాగంగా, 6నుంచి 10వ తరగతి విద్యార్థులను సీనియర్ విభాగంగా విభజించి వేర్వేరుగా శిక్షణ ఇచ్చారు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన చిత్రకారుడు ఆవుల వినోద్‌కుమార్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

**చివరి రోజు విద్యార్థులకు పోటీలు**

నాలుగు రోజుల పాటు శిక్షణ పొందిన విద్యార్థులకు చివరి రోజు చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. సుమారు 65మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని వివిధ రకాల చిత్రాలను వేశారు. కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావడంతో ముగింపు కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది.

**విజేతలకు ప్రోత్సాహక బహుమతులు**

పోటీల్లో సీనియర్ విభాగంలో టి.నందిని, 10వ తరగతి(ప్రథమ), నబీయాహా, 9వ తరగతి(ద్వితీయ), అగహా మహ్మద్, 6వ తరగతి(తృతీయ), చిన్మయి, 10వ తరగతి, కె.నందిని, 7వ తరగతి, జూనియర్ విభాగంలో చాణిక్య 5వ తరగతి(ప్రథమ), మాధవ్, 4వ తరగతి(ద్వితీయ), కీర్తి సహస్ర 3వ తరగతి(తృతీయ), నసీర్ అహ్మద్ 2వ తరగతి, స్వరణ్‌రెడ్డి 4వ తరగతి ప్రతిభ చూపారు. వీరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వీరితో పాటు కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మెడల్స్ అందజేశారు.

### చిత్రలేఖనం.. ఒక దృశ్య కళ

● యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతి

చిత్రలేఖనం అనేది ఒక దృశ్య కళ అని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. చిత్రలేఖనం శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిత్రలేఖనం అనేది చిత్రకారుడి నిర్దిష్ట భావాన్ని తెలియజేస్తుందని చెప్పారు. చిత్రలేఖనం ద్వారా విద్యార్థుల్లో ఉన్న కళా దృశ్యాలను చిత్ర రూపంలో వేయడానికి తోడ్పడుతుందన్నారు. ప్రస్తుతం ఇంట్లో విద్యార్థులు సెల్‌ఫోన్‌కు, టీవీలకు పరిమితం చేయకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా తల్లిదండ్రులు కళాత్మక రంగం వైపు దృష్టి సారించేలా కృషిచేయాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళను వెలికితీసేలా ఇలాంటి శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఆవుల వినోద్‌కుమార్‌ను సన్మానించారు. సాక్షి దిన పత్రిక జిల్లా స్టాఫ్ రిపోర్టర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మెంబర్‌షిప్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ తెలంగాణ రీజియన్ చైర్మన్ డాక్టర్ ఎంపల్ల బుచ్చిరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ గడ్డం జ్ఞాన ప్రకాష్‌రెడ్డి, క్లబ్ ప్రధాన కార్యదర్శి పక్కీర్ కొండల్ రెడ్డి, విజ్ఞాన్ స్కూల్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ పగిడాల జలంధర్‌రెడ్డి, క్లబ్ కోశాధికారి మహ్మద్ హనీఫ్ మెమన్, పాఠశాల డైరెక్టర్ పగిడాల పురేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జిల్లాల కొండల్‌రెడ్డి, బుస్సా రమేష్, ఎస్‌పీ ఉపేందర్, సాక్షి సిబ్బంది మాటూరి వెంకటేశ్వర్లు, కొల్లోజు శివకుమార్, ఎండి జమాలొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### సాక్షి మీడియా గ్రూప్‌కు కృతజ్ఞతలు



వేసవి సెలవుల్లో పిల్లలు సమయాన్ని వృథా చేయకుండా చిత్రలేఖనంపై ఉచిత శిబిరం నిర్వహించడం మంచి కార్యక్రమం.గతంలో పిల్లలు ఇంట్లో టీవీలకు, సెల్‌ఫోన్లకు పరిమితం అయ్యేవారు. శిబిరం వల్ల పిల్లల్లో ఉన్న సృజనాత్మక శక్తితో పాటు భావం వెలికి వస్తుంది. విద్యార్థుల కోసం ఉచితంగా చిత్రలేఖనం పై శిక్షణ శిబిరం నిర్వహించిన సాక్షి మీడియా గ్రూప్‌కు కృతజ్ఞతలు.

– కె.శైలజ, విద్యార్థిని తల్లి, భువనగిరి

### మెళకువలు నేర్చుకున్నా..



ఇప్పటి వరకు పాఠశాలతో పాటు ఇంట్లో సమయం దొరికినప్పుడు మాత్రమే చిత్రలేఖనంపై దృష్టి పెట్టేదాన్ని. డ్రాయింగ్ అంటే చాలా ఇష్టం. కానీ సమయం లభించదు. సాక్షి పేపరులో చిత్రలేఖనంపై ఉచితంగా శిక్షణ శిబిరం నిర్వహించబడుతుందని చూసాను. వెంటనే మొదటి రోజు నుంచి శిక్షణ కార్యక్రమానికి వచ్చాను. శిక్షణ శిబిరంలో డ్రాయింగ్‌లో మంచి మెళకువలు నేర్చుకున్నా.

– పి.శ్రావ్య, 7వ తరగతి, భువనగిరి

### సంతోషంగా ఉంది



చిత్రలేఖనంపై శిక్షణ శిబిరంలో చాలా విషయాలు తెలుసుకున్నా. ప్రతి రోజు సకాలంలో శిక్షణ తరగతులు వచ్చేదాన్ని. తనలో ఉన్న ప్రతిభ కంటే శిక్షణ ద్వారా మరిన్ని విషయాలు నేర్చుకున్నా. ఇందుకు శిక్షణ శిబిరం ఎంతో ఉపయోగపడింది. నిర్వాహకులకు ధన్యవాదాలు. చివరి రోజున పెట్టిన పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించడం సంతోషంగా ఉంది.

– నబీయాహా బుష్రా, 9వ తరగతి, భువనగిరి

### రోజుకు రెండు చిత్రాల చొప్పున..



చిత్రలేఖనం శిక్షణ శిబిరానికి నాలుగు రోజుల పాటు హాజరయ్యాను. ప్రతి రోజు రెండు కొత్త చిత్రాలు వేశాను. కోచ్ చిత్రాలు ఎలా వేయాలి. ఎలాంటి చిత్రాలు వేస్తే వాటిలో ఎలాంటి రంగులు అద్దాలో అనే విషయాలు చక్కగా వివరించారు. మరిన్ని రోజులు శిక్షణ శిబిరం నిర్వహిస్తే బాగుండు.

– బి.బిల్విక, 4వ తరగతి, భువనగిరి